

ఆఫీసుకు టయిమయిందంటూ గోడ గడియారం తొమ్మిదిసార్లు హెచ్చరించింది. చేతిలోంచి పేపరును అమాంతం విసిరేసి వంటింట్లోకి పరిగెట్టాను. ఇవ్వాళ తొందరగాకూడా పోవాలి. ఓ అర్జంటు పని పీకలపైనుంది. ఆఫీసు ఫైలొకటి ఇవ్వాళే పంపేయాలని ఆఫీసరుగారి హుకుం.

"సుజీ .... టైమ్ తొమ్మిది ... వంటగింట అయిందా" అంటూ పీటకోసం చూశాను. కాని అప్పటికే కంచంపెట్టి, పీటవాల్చి సిద్ధం చేసుంది.

"ఏమిటీవేళ విశేషం? రోజూ ఓ అరగంట వంటింటిలోంచి హాల్లోకి, హాల్లోనుంచి వంటింటిలోకి పచార్లు చేయించే దానివి ఈ రోజు ఇంత టంచనుగా పెట్టేస్తున్నావ్" అంటూ కూర్చున్నాను

ఓ చిరునవ్వు పారేసి, పైట బిగించి వడ్డన కుపక్రమించింది. వడ్డించిన ఆదరువులను చూసి మరింత ఆశ్చర్యపడ్డాను. అన్నీ నా కిష్టమైన వంటకాలే.

"ఇవ్వాళేమైనా షాపింగుకెళ్ళాలా?" అన్నా మా ఆవిడ చీరవంక భయంగా చూస్తూ.

"మీరు మరీను. మొన్ననే కదా కనకాంబరం రంగుచీర కొన్నది. అయినా ఎప్పుడూ నాకేగాని మీరొక్కటీ తీసుకోరు" అంది ఎయిర్‌కండిషన్డ్ (చిల్లులు పడిన) బనియన్‌వైపు చూస్తూ.

అది జాలిపడటమో, ముందు విషయానికి ఉపోద్ఘాతమో నా కర్థం కాలేదు.

"మీ నాన్నగారి దగ్గరనుంచి ఉత్తరాలు వచ్చి చాలా కాల మయిందనుకుంటాను" అన్నాను పుట్టింటికెళ్ళే పథకం ఏమైనా వుందేమోనని.

"అబ్బే! మొన్ననే వ్రాసారు కదటండీ అయినా ఉత్తమానం వ్రాయటానికేముంటాయి?" అంది మజ్జిగ తేవటానికి లోపలికెళుతూ.

భోజనంచేసి చేతులు కడుగుకుంటూంటే టవలందిస్తూ, "అలంకార్‌లో

కొత్త సినిమా వచ్చింది....'' అంటూ టవల్ తీసుకుంది.

ఇదన్నమాట ప్లాను. మొదటిరోజు. పైగా ఎవరో పద్మశ్రీ నటించిన సినిమా అంటూ అడ్డు చెప్పాలనుకున్నాను. కాని ''త్వరగా వచ్చేస్తారు కదూ'' అంటూ గోముగా అడిగిన సుజాత కద్దుచెప్పలేక పోయాను

సుజాత కళ్ళలోకి చూస్తుంటే ఆఫీసరు సింహం పిల్లిగా మారిపోయింది. నే చేయవలసిన, చూడవలసిన ఫైల్సు మంచు ముక్కల్లా కరగిపోయాయి.

"మరి నే వచ్చేసరికి సిద్ధంగా వుండాలి" అన్నాను చొక్కాచేతులు పైకి మడుచుకుంటూ.

ఆనందంతో అసలే పెద్దవైన సుజాత కళ్ళు మరింత వెడల్పయ్యాయి.

'త్వరగా వస్తారు కదూ మరి'' అంటూంటే మా ఆవిడ ఇక ఆఫీసుకు బయలుదేరమని గడియారం ఇంకొక్కమారు హెచ్చరించింది.

ఆఫీసులో గడియారంతోబాటు నేను, నాతోపాటు గడియారం పోటీ పడుతుంటూ మూడు గంటలదాక వచ్చాము. ఇంతలో మా ఆవిడకిచ్చిన వాగ్దానం గుర్తుకొచ్చింది. ఆ వేళే పంపాల్సిన కొన్ని కాయితాలకు సంతకాలు. వాటితోబాటు పర్మిషను తీసుకుందామనుకున్నాను.

ఆయన గదిలోకెళ్ళాను. ఇంతకు ముందు మా ఆవిడ కళ్ళలో పిల్లిగా మారిపోయిన మా ఆఫీసరుగారు కాని విమోచనం కలిగినట్లు మళ్ళీ సింహంగా మారిపోయున్నారు.

మొదటి ఫైల్ తీసారు. చదివి 'వెరీ గుడ్' అని అన్నారు. పర్మిషను అడుగుదామనుకున్నాను. మళ్ళీ అంతలోనే మనసు మార్చుకుని ఇంకొన్ని గుడ్లందుకుని కోరిక కోరుదామనుకున్నాను.

ఇంకోటి చదివి 'నైస్' అన్నారు. ఇంతకంటె మెచ్చుకోలు సంపాదించి అడుగుదామనుకున్న కోరికను ఇంకో ఫైలుకు వాయిదా వేసాను.

ఇంతలోనే ' ఇదేమిటి ఇలా వ్రాసారు?'' అన్నారు కళ్ళజోడు సవరించుకుంటూ. ''అయ్యో భగవంతుడా. ఇందాకా అడిగేసుంటే బావుండేదే'' అని విచారపడ్డాను.

మళ్ళీ "ఓహ్ ఇదా! బాగా వ్రాసారు" అన్నారు సంతకాలు పెడుతూ.

ఫైల్సు తీసుకుని ''ఇవ్వాళ ఓగంట పర్మిషన్ కావాలి'' అన్నా నసుగుతూ. ' నో ...సారీ'' ఇత్యాది పదాలు ఉపయోగించే ఆఫీసరు ఏమీ మాట్లాడకపోవటం ఆశ్చర్యం కలిగించింది.

తలెత్తి ఆశగా చూసాను. దానికేం భాగ్యం తీసుకోండి అన్నాడు. వ్వాట్ ఆఫీసరుగారేనా ఇలా మాట్లాడేది. దీనిని బట్టి సింహాల్లోకూడా మనుషులుంటారని తేలింది. చాలా ఆనందం కలిగింది.



థ్యాంక్యూ సార్ అని వెళ్ళబోతూంటే "అవునుగానీ ..." అంటూ ఆపారాయన. కారణా లడుగుతారేమోనని నీరసంగా వెనక్కు తిరిగాను.

"మీ ఇల్లు గుడిదగ్గరన్నారు కదూ." అంటూ చూసారు.

"అవును సార్."

"ఆ గుడిపక్కనే ఇల్లొకటి కట్టిస్తున్నాను తెలుసుగా!" ఆగాడు.

"ఆహా! తెలియకపోవడం ఏమిటండీ. మొన్న చూపించారుగా" అన్నాను.

"ఆదే. అక్కడ పనివాళ్లు సరిగా వర్క్ చేస్తున్నారో లేదో ఓమారు చూసి వెళ్ళండి. నాకు తీరికలేదు" అన్నారు.

ఇలా చిన్నచిన్న పనులు మాకు పురమాయించటం మా ఆఫీసులో ఎవరికీ కొత్తేమీ కాదు.

"అలాగే సార్" అని బయటపడ్డాను.

ప్లాటుదగ్గర కెళ్ళాను. కూలీలు అందరూ తీరిగ్గా కూర్చున్నారు. కొందరు బీడీలు తాగుతూంటే మరి కొందరు సినిమాల గురించి చెప్పుకుంటున్నారు. ఒకరిద్దరు చెట్టుకింద జోగుతున్నారు. పారలు, తట్టలు, గునపాలు విశ్రాంతి తీసుకుంటున్నాయి. నారాక అందరిలోను సంచలనాన్ని కలిగించింది.

ఆడవాళ్ళు తలపై కుదురులని సవరించుకొని తట్టలు తీసుకొని బయలుదేరారు. మగవాళ్ళు బీడీలు పారేసి మెల్లగా గునపాలు తీసుకుని బయట తవ్వడాని కుపక్రమించారు.

ఒకచోట ఒక కూలీమనిషి బీడీ

తాగుతూ అదకూలీలతో సరసా లాడు తున్నాడు. ఒళ్ళు మండింది. పని చెయ్యంర్రా అని దబ్బాలిస్తే ఇదీ వీళ్ళ వరస. వీళ్ళందరిని హెచ్చరిస్తూ ఇల్లు కట్టించటం సామాన్యమైన విషయం కాదు అందుకనే "ఇల్లు కట్టి చూడు" అనేకవిని కూడ "పెళ్ళి చేసిచూడు" అనే కష్టతరమైన బాధ్యతలలోకి తోసేసారు.

"ఇక్కడ వాడివేనా నువ్వు?" అధికార దర్పంగా అడిగాను.

"ఆఁ" అన్నాడు నిర్లక్ష్యంగా చిర్రెత్తుకొచ్చింది

"మరి పనిచెయ్యవేం?" కోపంగా అడిగాను

"చేసేదేమిటి" అంటూ, ఆ కూలీదాని వేపు తిరిగి 'ఈ గజాసేద కొన్నావ్" అంటూ దాని చేతులు నవరిస్తున్నాడు.

"ఇదిగో... నిన్నే" తీక్షణంగా పిలిచాను. ఇక్కడ నీకు డబ్బులిచ్చేది సరసాలాడటానికనుకున్నావా?' గద్దించాను.

"సరసా లెవడాడాడు. సరిగా మాటాడవయ్య" అంటూ కయ్యానికి దిగబోయాడు. ఇంతలో ఇంకో కూలీ మధ్యలో కల్పించుకుని వాడిని లాక్కుపొయ్యాడు.

"పిచ్చోడు బాబూ. వాడితో మీకేటి?" అని సర్ది చెప్పాడు.

టైము చూసుకున్నాను. నాలుగవుతూంది. ఎండలో తీక్షణత తగ్గుతూంది. సుజాత ఈపాటికి ఇంటిదగ్గర ఏం చేస్తూంటుందో ఊహిస్తూ ఓ పదినిముషాలు గడిపాను. ఇక వెడదామనుకుంటున్నాను. ఇంతలో బాబుగారూ అంటూ ఒక కూలీ నన్ను హెచ్చరిస్తూ పక్కకు తొయ్యడం నేలమీద ఒక గునపం పాతుకుపోవటం లిప్తపాటులో జరిగిపోయాయి. హఠాత్తుగా జరిగిన ఈ సంఘటనకు మాన్పడి పోయాను. దూరంగా కూలీ పారిపోతూ కనిపించాడు.

పక్కకు పడటంవల్ల మోచేతులు గీరుకుపోయాయి. అప్పటికే కూలీలందరు పనులు వదిలేసి చుట్టూ మూగారు.

"ఎంతపని చేసాడు దొంగ."

"సర్పయ్యగాని చూడక పోయుంటే ప్రాణాలు పోయేవి కాదంటావా"

"దొంగ చచ్చినాడు పని చేయలేదని నాలుగు మాటలంటే ఏమొచ్చింది" అందరూ తలో విధంగా వ్యాఖ్యానిస్తున్నారు.

"ఎల్లెండెహె పన్లు చేసుకోండి" అంటూ చుట్టూ మూగిన కూలీలను పంపించేసాడు నన్ను పక్కకి తోసి కాపాడిన కూలీ. వాడివేపు చూసాను. ఇరవై ఏండ్లుంటాయి. చిరిగిన చొక్కా. నిక్కరు మనిషి పేదఅయినా మనసు చాలా గొప్పది.

"ఎంత గండం గడిచింది. అదృష్టం బావుంది లేకపోతే" ఆపైన ఊహించటానికే భయం వేసింది

వెళ్ళి పోతున్న ఆ కూలీని పిలిచాను.

"నీ పేరేమిటి?"

"నర్సయ్యంటారు బాబూ" అన్నాడు చేతులు కట్టుకుని.

"ఇదో నర్సయ్యా! ఈవేళ నన్ను సమయానికి ఆదుకున్నావ్.

ఇదుంచు." అంటూ వాడిచేతిల్లో అయిదు నోటుంచాను.

"ఇదెందుకు బాబూ! [illegible]న్నా నేనుండే ఏమయినా కట్టడు కదా నే చేసిందే ముంది" అంటూ తీసుకోవటానికి నిరాకరించాడు.

"ఇలాంటి అయిదు లెన్నిచ్చినా చాలవు. ఏదో నా తృప్తికోసం" అని వాడిచేతుల్లో బలవంతంగా దాన్ని కుక్కాను. అక్కడ నుంచి మెల్లగా ఇంటివైపుకు నడక సాగించాను.

ముందు నా సహోద్యోగి ప్రకాశం వెళ్తున్నాడు. చప్పట్లుకొట్టి పిలిచాను.

"ఏం ఇంకా ఇంటికి పోలేదా?" అన్నాడు ప్రకాశం

"లేదు. ఆఫీసునుంచి ఇంటికొస్తూ మన ఆఫీసరుగారి ప్లాటుకెళ్ళి వస్తున్నాను. అక్కడ ఓ చిన్న అడ్వెంచర్."

"ఏమయిందేమిటి?" కుతూహలంగా అడిగాడు.

"ఒకకూలి పనిచెయ్యకపోతే కోప్పడ్డాను. వాడు కాస్త చంపడానికి తయారయ్యాడు."

"అయినా ఎవరో రక్షించుంటారు. లేకపోతే ఇంకేమైనా జరిగిందా?" అన్నాడు మామూలుగా.

"రక్షించక పోయుంటే ఇక్కడెందుకుంటాను. ఈపాటికి ఆసుపత్రిలో వుండే వాడినికదా!" ఆందోళన పడవలసిన సంఘటనకు కనీసం ఆశ్చర్యం కూడా ప్రకటించక పోవడం నాకు కోపం తెప్పించింది.

కొంచెం దూరం ఇద్దరం మాట్లాడుకోకుండా నడిచాము. ఇద్దరం "చౌరస్తా" దగ్గర విడిపోయాము.

"నీదాకా వస్తేనే గాని తెలియదు. ఇలాంటివి అనుభవించాలి గాని చెప్తే ఇలాంటి పిచ్చి సన్నాసులకు ఏం బోధపడతుంది." అనుకున్నాను.

నా కోసం సుజాత ఇంటిదగ్గర కాచుకుంది. మురికైన బట్టలను, మట్టి కొట్టుకుపోయిన మోచేతులను చూసి కంగారుగా దగ్గర కొచ్చింది ఏమయిందంటూ.

సాధ్యమైనంత తేలికగా, క్లుప్తంగా చెప్పాను జరిగిన విషయాన్ని. నేను కూడా దాన్ని ప్రకాశం తీసుకున్నంత తేలికగా తీసుకుందా మనుకుని ప్రయత్నించాను. కాని నా వల్ల కాలేదు. శ్రీమతి నాకంటె ఎక్కువగా బాధ పడింది. ఎంత చెప్పినా వినకుండా సినిమా ప్రోగ్రాం కాస్తా గుడి ప్రోగ్రాం కింద మార్చేసింది.

మర్నాడు ఆఫీసులో మధ్యాన్నందాక చెప్పుకోదగ్గ సంఘటనలు లేకుండానే

గడిచిపోయింది. మూడు గంటల ప్రాంతంలో ఆఫీసరుగారు ప్లాటు దగ్గర పనెలా సాగుతుందో చూడాలంటూ వెళ్ళిపోయారు.

పది నిముషాలు గడిచాయి.

ప్రకాశం నా దగ్గరకొచ్చి త్వరగా బయలు దేరాలి యివ్వాళ మీకో వింత చూపిస్తాను అన్నాడు. నిన్నటి సంఘటనతో ప్రకాశంమీద నాకు సదభిప్రాయం తగ్గింది.

నేను కూడా "వింతలేముంటాయ్ అన్నీ మామూలుగానే వుంటాయి నాకు" అన్నా ఎగతాళిగా నవ్వి.

కాని ప్రకాశం వదల్లేదు. చివరకు బయలుదేరక తప్పింది కాదు.

సరాసరి ఆఫీసరుగారు ఇంటిప్లాట్ దగ్గరకు తీసుకొచ్చాడు. ఇక్కడి కెందుకు వచ్చినట్టు? ప్రశ్నార్థకంగా ప్రకాశంవేపు చూశాను. ఇద్దరం చెట్టు నీడలో నిలబడ్డాము. పైన పక్షులు రొదచేస్తున్నాయి. ఎండలో చురుకు పాలు తగ్గలేదు.

నిన్నటి విషయాన్ని పదేపదే జ్ఞప్తికి తెచ్చే ఆ స్థలం నాకు నచ్చలేదు. ప్రకాశం నన్ను తట్టి చూడమన్నట్టుగా కళ్ళెగరేశాడు. అటువైపు చూశాను. నిన్ననాతో ఘర్షణపడిన కూలీయే. యివ్వాళ ఆఫీసరు గారితో వాదిస్తున్నాడు.

"రాస్కెల్ వాడే నిన్న నన్ను చంపడానికి ట్రై చేసింది" ముందుకు పోబోతున్న నన్ను ప్రకాశం చేయి పట్టుకు ఆపాడు.

"వదులు వాడి అంతు తేలుస్తాను" అన్నా కోపంతో చేయి విడిపించుకుంటూ.

"ప్లీస్ వెయిట్ అండ్ సీ. వింతని ముందే చెప్పానుగా అన్నాడు ప్రకాశం నా చెయ్యిని మరింత గట్టిగా పట్టుకుంటూ.

ఘర్షణపడిన కూలీ గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు.

ఆ కూలీ వెనక్కు వెళ్ళినట్టే వెళ్ళి ఆఫీసరుగారి మీదకు లంఘించాడు. అతని చేతుల్లో పదునైన ఆయుధమేదో వుంది. దీనిని కూడా ప్రకాశం మామూలుగా తీసుకోవటం సహించలేక పోయాను. నేను ఆయనను హెచ్చరించేలోనే నిన్న నన్ను రక్షించిన సర్పయ్య ఆఫీసరుగార్ని పక్కకు నెట్టెయ్యడం జరిగింది. ఈ లోపల ఆ కూలీ తప్పించుకుని పిక్కబలం చూపించాడు.

"ఆశ్చర్యం నిన్న నాకూడా ఇలాగే జరిగింది. నిజంగా కూలీ సర్పయ్య దేవుడయుండొచ్చు... నా మాటలను మధ్యలో ఆపుతూ "ఇవాళేకాదు కొత్తగా వచ్చిన ప్రతివారికి దేవుడవుతాడు" అన్నాడు ప్రకాశం తమాషాగా నవ్వుతూ.

"మరి ఆఫీసరుగారు కొత్తవారేం కాదుగా?" వ్యక్తం చేశాను.

"కాని మోసానికి కొత్తవారే" అన్నాడు ప్రకాశం.

"మరి ఈ మోసాన్ని ఆఫీసరుగారికి చెబితే" అన్నానావేశంగా.

"చెప్పినా ఇప్పుడెవరూ నమ్మరు. జరిగిన సంఘటనలాటిది. మనం చెయ్యగలిగేదేం లేదు. అటు చూడండి" అన్నాడు.

మొహమాటం పడుతూనే ఆఫీసరుగారి దగ్గరనుంచి కృతజ్ఞతలతో బాటుగా డబ్బులు కూడా అందుకున్నాడు నర్సయ్య.

చాలాసేపటివరకు నేనేమి మాట్లాడలేక పోయాను.

"పదండి ఏమిటలా వున్నారు?" అంటూ ప్రకాశం నా భుజం మీద తడుతూ "ఇన్ని ఎత్తులూ, మోసాలూ.... అన్నీ కూటికోసం. జస్ట్ ఫర్ ఎ ఫ్యూ డాలర్స్ మోర్" అన్నాడు బాధగా నవ్వుతూ.

—